క్లుప్తంగా

పాదర్తిలో ఎద్దు మృతి

● ఇప్పటికే రెండు ఎద్దుల మృతి చెందడంతో ఆందోళనలో రైతులు



మృతి చెందిన ఎద్దు

పాదర్తి (కొత్తపట్నం): మండలంలోని పాదర్తి గ్రామంలో ఆదివారం రూ.70 వేల విలువ చేసే ఎద్దు మృతిచెందింది. గ్రామంలో ఇటీవలే వరుసగా రెండు ఎద్దులు మృతిచెందాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మృతిచెందిన ఎద్దు వయసు 3 సంవత్సరాలు ఉంటుంది. ఈ ఎద్దుకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. అటువంటి ఎద్దు చనిపోవడం చర్చనీయాంశమైంది. ఎద్దు అస్వస్థతకు గురైందని చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, అంబులెన్స్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని బాధితుడు మూగ రామమూర్తి వాపోతున్నాడు. మృతి చెందిన ఎద్దుకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.

వెంకటాపురంలో పెద్దమ్మ జాతర

దొనకొండ: మండలంలోని వెంకటాపురంలో గ్రామస్తులు మూకుమ్మడిగా కులాలకు అతీతంగా ఆదివారం పెద్దమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించారు. రాత్రికి పెద్దమ్మకు మొక్కు బడులు చెల్లిస్తారు. 3 సంవత్సరాలకు ఒకసారి పెద్దమ్మ జాతర నిర్వహించేవారు. కరోనా సందర్భంగా 7 సంవత్సరాలకు జాతరను జరుపుకుంటున్నారు.

వైభవంగా గోపయ్య స్వామి ఆలయ వార్షికోత్సవం

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల గ్రామంలో ఆదివారం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పలువురు దంపతులు పీటలపై కూర్చొని కళ్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కమిటీ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజారి జనార్దన శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గుంటి గంగా భవాని అమ్మవారికి విశేష పూజలు



అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అమ్మవారికి భక్తులు ఐదు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 7,342 ఆదాయం వచ్చినట్లు ఆర్‌పి శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

54 మద్యం సీసాలు స్వాధీనం

దొనకొండ: అక్రమంగా తరలిస్తున్న 54 మద్యం సీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ యం.సైదుబాబు తెలిపారు. దర్శి మండలం చందలూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దొనకొండ నుంచి అక్రమంగా 54 మద్యం సీసాలు తరలిస్తున్నారు. సమాచారం మేరకు తాము, తమ సిబ్బందితో వెళ్ళి పట్టుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వారిని దర్శి సబ్ కోర్టుకు హాజరు పరుచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక పూజల్లో కుందురు తిరుపతిరెడ్డి దంపతులు, భక్తులు

కనిగిరి రూరల్: కేటీఆర్ స్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. నూతన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఎంతో భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అంకురారోహణం నిర్వహించారు. విశాఖపట్నం, రాజమండ్రి నుంచి వచ్చిన పురోహితులు సూర్య నారాయణమూర్తి, సూరిబాబు, సాయికుమార్‌ల ఆధ్వర్యంలో ఎంతో నియమ నిష్టలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కేటీఆర్ విద్యా సంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి శారద దంపతులు, మాజీ మంత్రి ముక్కుకాశిరెడ్డి దంపతులు, సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం తదితరులు విశిష్ట పూజల్లో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి పెద్ద పీట



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట



దళితుల భూముల్లో నాట్లు వేస్తున్న కూలీలు



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న దళితుల భూములను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం (ఫైల్)

- దళితులకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూముల్లో సాగుకు ప్రణాళిక
- కొత్తపట్నం మండలంలో 34 ఎకరాల్లో సాగు
- నూరు శాతం ఫలితాలు

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ఇప్పటికే ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. ప్రత్యేకంగా దళితులకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూముల్లో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టింది. ఆ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎక్కడైతే ప్రభుత్వం దళితులకు అసైన్‌మెంట్ భూములను వ్యవసాయానికి అందజేసిందో.. అక్కడ ప్రకృతి వ్యవసాయం చేయాలని వ్యవసాయ శాఖ ద్వారా ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగా కొత్తపట్నంలో దళితకులకు కేటాయించి డీకే పట్టాలు అందజేసిన 36 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆ భూముల్లో అనేక సంవత్సరాల నుంచి వరి సాగుచేసుకుంటూ లబ్ధిదారులు జీవిస్తున్నారు. అయితే, అధిక శాతం కాంప్లెక్స్ ఎరువుల వాడకం వలన పొలం నిర్జీవమై దిగుబడులు రావడం లేదు. సాగుచేసిన పంటను భారీగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించి ప్రతి ఒక్క రైతుతో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నారు.

అధిక దిగుబడి రావడంతో రైతుల ఆసక్తి...

మండలంలో 64 మంది రైతులను ఒక యూనిట్‌గా చేసి ప్రకృతి వ్యవసాయం చేయాలని అధికారులు అవగాహన కల్పించారు. అందులో కొంత మందిని ప్రకృతి వ్యవసాయ సిబ్బందిగా కూడా తీసుకున్నారు. ఒక్కొక్కరికి 50 సెంట్ల నుంచి ఒక ఎకరాలోపే భూమి ఉండగా, అధికారుల సూచనల మేరకు ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దళితులను ఒక యూనిట్‌గా చేసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి వారానికి ఒక రోజు ఫీల్డ్‌కు వెళ్లి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఒక ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేలలోపు పెట్టుబడి పెడుతున్నారు. ఎకరానికి 35 బ్యాగ్‌ల నుంచి 40 బ్యాగ్‌ల దిగుబడిని రైతులు సాధిస్తున్నారు. దీంతో మిగిలిన రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు.

ధర రెట్టింపు...

ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి విక్రయించే ధాన్యం రెట్టింపు ధర పలుకుతుండటం కూడా రైతుల ఆసక్తికి కారణమవుతోంది. ఇందులో క్రిమిసంహారక మందులు ఉన్నాయా, లేదా..? అని పరీక్షలు చేయించి మరీ కొనుగోలు చేస్తున్నారు. కషాయాలతో పండించే ధాన్యాన్ని పరీక్షించగా నూరు శాతం క్రిమిసంహారక మందులు లేవని నిర్ధారిస్తున్నారు. అప్పుడు కొనుగోలుదారుడికి నమ్మకం ఏర్పడి అధిక ధర పెట్టి కొంటున్నారు. దీంతో రైతుకు రెట్టింపు ధర పలికి లాభాలు వస్తున్నాయి. 76 కేజీల బ్యాగ్ రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు ధర పలుకుతోంది. ఎకరాకు పెట్టుబడి రూ.20 వేలు పెడితే దిగుబడి 35 బ్యాగ్‌లు వస్తోంది. ఒక్కో బ్యాగ్‌ను రూ.2 వేల చొప్పున అమ్మకం చేయగా, రూ.70 వేల ఆదాయం వస్తోంది.


మేము పండించుకుని తింటున్నాం



ప్రభుత్వం అసైన్‌మెంట్ భూమి ఒక ఎకరా ఇచ్చింది. దానిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా ధాన్యం సాగుచేస్తున్నాం. పూర్తిగా ఆకులతో తయారు చేసిన కషాయాన్ని పిచికారీ చేస్తున్నాం. అన్నం కూడా బాగా ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటున్నాం. మాకు సరిపడా ఉంచుకుని మిగతావి అధిక ధరకు విక్రయిస్తున్నాం.

– పట్టపు సునీత, దళిత రైతు, కొత్తపట్నం

దళితుల భూముల్లో ప్రత్యేక శ్రద్ధ



దళితుల భూముల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మాచేత అన్ని విధాలుగా కషాయాలు చేయిస్తున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో మా దళితుల భూములన్నింటిలో ప్రకృతి వ్యవసాయంతోనే పంటలు సాగుబడి చేస్తున్నాం. తక్కువ పెట్టుబడితో అధిక లాభం చూస్తున్నాం.

– పి.సురేష్, రైతు, కొత్తపట్నం

ప్రకృతి వ్యవసాయం పెంపునకు సన్నాహాలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంపై ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. ప్రకృతి వ్యవసాయానికి బడ్జెట్ కూడా కేటాయించింది. జిల్లాలో దళితులకు ఇచ్చిన అసైన్‌మెంట్ పొలాల్లో ప్రకృతి వ్యవసాయం చేసి వారికి ఆ ధాన్యాన్ని తినిపించే అలవాటు చేయాలనే ఉద్దేశంతో కొత్తపట్నం మండలంలో 64 మంది దళిత రైతుల పొలాల్లో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న దళిత రైతుల పొలాల్లో కూడా ప్రకృతి వ్యవసాయం చేయించేందుకు కృషి చేస్తున్నాం.

– వి.సుభాషిణి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

రామతీర్థం ఆలయంలో పొంగళ్లు



కార్యక్రమంలో పాల్గొన్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: మండలంలోని రామతీర్థంలో గంగమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన పొంగళ్ల కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. చీమకుర్తి 16వ వార్డు కౌన్సిలర్ తెల్లమేకల సులోచన, ఎల్లయ్య, తెల్లమేకల గాంధీ ఆధ్వర్యంలో ఆలయంలో మొక్కు తీర్చుకునే సందర్భంగా పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కు తీర్చుకుని పొంగళ్లు పెట్టారు. బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కనిగిరి రూరల్: పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో ఆదివారం పామూరుకు చెందిన ఎస్‌కే ఖాజా మస్తాన్ భార్య రహీమున్నిసాకు రూ.6 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పులి శాంతి గోవవర్ధన్‌రెడ్డి, మాణిక్యరావు, ఖాదర్ బాష, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు టి.సుజాతరెడ్డి, సంగు సుబ్బారెడ్డి, భారతి, గౌస్‌బీ, కంటు గురవయ్య, దేవరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూలవిరాట్టు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

అద్దంకి: సంతమాగులూరు మండలంలోని అడవిపాలెంలోని నీలంపాటి అమ్మవారి నాలుగో వార్షికోత్సవం ఆదివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారికి మండలంతోపాటు పరిసర మండలాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి కుంకుమ పూజలు చేశారు. వార్షికోత్సవ తిరునాళ్ల సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రికి తిరునాళ్ల నిర్వహించనుండటంతో ఎలక్ట్రిక్‌ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన పాట కచేరీలు అలరించాయి.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పాల్గుణ మాసం కృత్తిక నక్షత్రం నవమి సందర్భంగా సోమదివారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో గో పూజా చేపట్టారు. ఆదివారం సందర్భంగా నారాయణస్వామి ఆలయంలో అభిషేకం, అర్చన, గోపూజ, మహా నివేదన, పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. మహా నివేదన పూజల్లో భాగంగా భక్తులు పొంగళ్లు చేతబూని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. ఆలయ పూజారులు సత్యనారాయణశర్మ, ప్రసాద శర్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

గ్రంథాలయంలో రికార్డుల పరిశీలన

త్రిపురాంతకం: స్థానిక శాఖా గ్రంథాలయంలో రికార్డులను ఆ శాఖ జిల్లా కార్యదర్శి బొమ్మల కోటేశ్వరి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రంథాలయానికి అవసరమైన సామగ్రిని త్వరలోనే మంజూరు చేస్తామని, వేసవిలో పిల్లలు, పెద్దలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠకుల కోసం ఆన్ డిమాండ్ బుక్ రిజస్టర్ అందుబాటులో ఉంచాలని చెప్పారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామివారి 15వ వార్షికోత్సవం

కారంచేడు: గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి 15వ వార్షికోత్సవం ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు తెలిపారు. మండంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన నాగేశ్వరస్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం నుంచి విఘ్నేశ్వరపూజ, స్వామివారికి రుద్రాభిషేకాలు, పార్వతీ అమ్మవారికి కుంకుమార్చన, పంచముఖ ఆంజనేయస్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహిస్తారని కల్యాణ మహోత్సవంలో పాల్గొనాల్సిన భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలని వారు కోరారు.

ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలి

ఉలవపాడు: మండల పరిధిలోని చాకిచర్ల యానాదిసంఘం జీవీవీకె పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని ప్రభుత్వం సస్పెండ్ చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు పోట్లూరి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధాయుడు ఎం ఆంజనేయులు ఈ నెల 8 న పాఠశాలలో మద్యం సేవించి అనంతరం అక్కడే మూత్రం పోసి పడిపోయాడు. విషయం తెలుసుకుని ఎంఈఓ నూకతోటి ప్రసాద్ వెళ్లి పరిశీలించి రిపోర్టు కూడా అందచేశారు. అయినా గిరిజన సంక్షేమ శాఖ కనీస చర్యలు తీసుకోలేదు. గిరిజన సంక్షేమ శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో గ్రానైట్ లారీ

మార్టూరు: అక్రమంగా గ్రానైట్ రాయి తరలిస్తున్న ఓ వాహనాన్ని ఆదివారం రాత్రి మార్టూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోజు వారి తనిఖీలో భాగంగా ఎస్సై కే కమలాకర్ తమ సిబ్బందితో కలిసి స్థానిక జాతీయ రహదారిపై నిఘా ఉంచారు. గ్రానైట్ రాయిని ఇతర రాష్ట్రానికి తరలిస్తున్న లారీ అధికారులు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేని విషయం గుర్తించారు. వాహనాన్ని స్టేషన్కు తరలించి సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

టంగుటూరు గ్రంథాలయంలో 1800 పుస్తకాలు

టంగుటూరు: టంగుటూరు గ్రంథాలయంలో 1800 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలని జి.వర్ధనరాజు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కోటా సత్యమాంబదేవికి పూజలు



ప్రత్యేకాలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్ర నామపూజలు, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మ ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు రెండో ఆదివారం భక్తులు పోటెత్తారు. పూజారి వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయ ప్రాంగణంలో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ బి. శ్రీనివాసులు, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు అన్ని ఏర్పాట్లను చేశారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రణీత్‌రెడ్డి



మందులు అందిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: స్థానిక 3వ డివిజన్‌లో నవయుగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాస్ సూపర్‌స్పెషాల్టీ సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి ప్రారంభించారు. డాక్టర్ జ్యోత్స్న కొప్పుల, డాక్టర్ శ్రీనివాస్ గోనుగుంట్ల పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రణీత్ రెడ్డి మాట్లాడుతూ మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారంటూ నిర్వాహకులను అభినందించారు. పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. ఉపాస్ హాస్పిటల్ నిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల్లో ఉంటుందని, అందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గండు ధనలక్ష్మి మధు, ఎందేటి పద్మావతి రంగారావు, చల్లా తిరుమలరావు, 3వ డివిజన్ అధ్యక్షుడు జాఫర్, 5వ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ సత్యన్నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రావూరి బుజ్జి, దుంబూ, పిచ్చయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటనలో బడి ఈడు పిల్లలు

కంభం: పాఠశాలకు వెళ్లి పుస్తకాలు చేతబట్టి చదువుకోవాల్సిన పిల్లలు ఇంకా వీధుల వెంట భిక్షాటన చేసుకుంటూ కనిపిస్తున్నారు. ప్రభుత్వం పేదలందరికీ నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుంది. తల్లిదండ్రుల అవగాహన లోపం, కొన్ని చోట్ల విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యంతో బడిఈడు పిల్లలు రోడ్ల వెంబడి భిక్షాటన చేసుకుంటూ దర్శనమిస్తున్నారు. బడిఈడు పిల్లలను గుర్తించే కార్యక్రమం నిరంతరంగా జరుగుతున్నప్పటికీ అక్కడక్కడ చిన్న పిల్లలు భిక్షాటన చేసుకుంటూ కనిపిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. కొందరి పిల్లల పేర్లు పాఠశాలల్లో నమోదై ఉన్నప్పటికీ వారు చదువుకోడానికి వెళ్ళకుండా రోడ్ల వెంట తిరుగుతున్నారు. అటువంటి వారిని విద్యాశాఖ సిబ్బంది గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలందరినీ చదువుకునేలా ప్రేరేపించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సహాయం



చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం తూమాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వర్లు ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబానికి యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం కింద రూ.1.50 లక్షలను సంఘ నాయకుడు జె.కేశవరాజు ఆదివారం అందజేశారు. టీచర్ వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు ఉమా మహేశ్వరి, రాజసులోచన, దామచర్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.